సాక్షి తిరుపతి

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



మరో వైఎస్సార్‌సీపీ నేత టార్గెట్
మరో వైఎస్సార్‌సీపీ నేతను లక్ష్యంగా చేసుకుని టీడీపీ గూండాలు వారం రోజులుగా దాడులకు తెగబడుతున్నారు.
- 8లో



మద్యం పట్టివేత
నాయుడుపేటలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా సెబ్ అధికారులు 72 బాటిళ్లను పట్టుకున్నారు.
- 8లో



గ్రీవెన్స్‌కు 201 వినతులు
జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు.
- 8లో

న్యూస్‌రీల్

ఎస్వీయూలో ఆకస్మిక తనిఖీలు



వర్సిటీలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు సోమవారం వర్సిటీలోని పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్ట్స్ బ్లాక్‌లోని తెలుగు, సంస్కృతం, ఇంగ్లిషు విభాగాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరుపై అధ్యాపకులను వివరణ కోరారు. విద్యార్థుల హాజరుపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో లోతైన అధ్యయనం చేయించి జ్ఞానాన్ని పెంపొందించే బాధ్యత అధ్యాపకులదేనని చెప్పారు. ఆయనతో పాటు పలు విభాగాల డీన్లు, అధ్యాపకులు ఉన్నారు.

త్వరలో సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్‌తో ఎంఓయూ

తిరుపతి సిటీ: సంస్కృత భాషాభివృద్ధికి సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్‌తో త్వరలో ఎంఓయూ కుదుర్చుకునే విషయంపై జాతీయ సంస్కృత వర్సిటీ అధికారులు సోమవారం పలు అంశాలపై చర్చించారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశం అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాషాభివృద్ధి కోసం అధునాతన టెక్నాలజీతో ఆధునిక మాధ్యమాలలో శాస్త్రాల జ్ఞానాన్ని ప్రచారం చేయడం కోసం సిద్ధాంత ఫౌండేషన్‌తో చర్చించామన్నారు. వేదిక ఫామ్ ఆఫ్ అగ్రికల్చర్, ప్రాచీన పాకశాస్త్రం, గణితం, సంస్కృత వినోదం, ప్రశ్నశాస్త్రం, సిద్ధాంత జ్యోతిష్యం అనే విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. అదేవిధంగా వర్సిటీలో గురుకుల పద్ధతిలో మిషన్ దశరథ పథకం ద్వారా పది శాస్త్రాల్లో పదేళ్ల పాటు పదిమంది విద్యార్థులకు నెలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సిద్ధాంత టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ జయకృష్ణ, శాస్త్రవేత్తలు సుదర్శన్, లక్ష్మీ ఆత్రేయ సత్యనారాయణ, మేనేజర్ రాంబాబు, వర్సిటీ రిజిస్ట్రార్ రమాశ్రీ, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం



విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సైదాపురం: వ్యక్తి మృతి విషయంలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మండల కేంద్రం సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సకాలంలో వైద్యం అందక నెల్లూరు జిల్లా సైదాపురం దళితవాడకు చెందిన మల్లారపు వీరరాఘవయ్య(49) ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై ఆయన క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సైదాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రికి రాగా, స్టాఫ్ నర్సు శాలిని రోగి పల్స్ చూసి తక్కువగా ఉండడంతో వెంటనే గూడూరుకు తీసుకెళ్లాలని చెప్పారన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మధ్యాహ్నానికే వైద్యులు వెళ్లిపోయారన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టామన్నారు. ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటనపై ఆందోళన చేస్తున్న వారితో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ విజయ్‌కుమార్ మాట్లాడి ధర్నా విరమింపజేసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

"మేం ఏం పాపం చేశాం..ఎవరికి అన్యాయం చేశాం.. పాడినే నమ్ముకుని బతుకున్నాం.. మాకు ఎందుకు రాజకీయాలు.. మా కడుపు ఎందుకు కొడుతున్నారు.. మాకు సీఎం చంద్రబాబునాయుడు, సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అందరినీ ప్రశ్నించడమే లక్ష్యమంటూ చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మా గోడు పట్టించుకోండి" అంటూ పాడి రైతులు తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అమూల్ సంస్థ ఈ నెల 21 నుంచి పాల సేకరణ చేయలేమని చెప్పడంతో తిరుపతి, చంద్రగిరికి చెందిన వందలాదిమంది పాడి రైతులు ధర్నా చేపట్టారు. అమూల్ సంస్థకు కూటమి ప్రభుత్వ పెద్దల నుంచి రాజకీయ ఒత్తిళ్లు చేయించి తమకు అన్యాయం చేస్తున్నారని రైతులు వాపోయారు.



తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు

పాడి కడతారా...!

- పాడి పైనే ఆధారపడి బతుకుతున్న మాపై రాజకీయ కక్షనా ?
- బ్యాంకుల్లో రుణాలు తీసుకుని పాడి పశువులను కొన్నాం
- ఈ నెల 21 నుంచి పాలు సేకరించలేమని చెప్పిన అమూల్ సంస్థ
- అమూల్ సంస్థకు కూటమి ప్రభుత్వంలోని పెద్దల నుంచి హెచ్చరికలు
- 20 వేల లీటర్ల పాలను ఎవరికి పోయాలి ?
- తిరుపతి జిల్లా కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా పాడిరైతుల ఆగ్రహం
- సీఎం సొంత సంస్థ హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకేనా..!

తిరుపతి అర్బన్: పాడిరైతులు బహిరంగ పోరాటానికి దిగారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద భారీగా ధర్నాకు దిగారు. పాడినే నమ్ముకుని బతుకుతున్న తమపై రాజకీయ కక్ష కడతారా ? అని గళమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ పాల సంస్థకు పాల సేకరణ అప్పగించారు. ఆ సంస్థకు పాలు పోయడం ద్వారా లీటర్‌కు రూ.34 నుంచి రూ.43 ఇప్పించి లబ్ధి చేకూర్చే కార్యక్రమం చేపట్టారు. అప్పటి నుంచి పాడి రైతులు కూడా ఆ అమూల్ సంస్థకు పాలు పోసి లాభాలు ఆర్జిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పాడి రైతులపై కక్ష కట్టింది. ప్రభుత్వ ఒత్తిళ్ల కారణంగా ఈ నెల 21 నుంచి అమూల్ సంస్థ పాల సేకరణ చేపట్టలేం అని చెప్పింది. దీంతో పాడి రైతులు సుమారు రోజుకు 20 వేల లీటర్లు పాలు ఒక్కసారిగా నిలుపుదల చేస్తే ఎవరికి పోయాలి ? అని గళమెత్తారు. న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందించి మొరపెట్టుకున్నారు. దీంతో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఎటుచూసినా పాడి రైతులు, చిరుద్యోగులే దర్శనమిచ్చారు. కనిపించిన అధికారికల్లా వారి ఆవేదన, ఇక్కట్లను వివరించారు.

అమూల్‌తోనే లాభాలు

అమూల్ పాల సంస్థ లీటర్ పాలకు రూ.34 నుంచి రూ.42 వరకు చెల్లిస్తుంది. ప్రతి పది రోజులకు ఒకసారి రైతులకు పాల బిల్లులు అందిస్తోంది. ఆవులు, బర్రెల సంఖ్యను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అమూల్ సంస్థ ద్వారానే రుణాలు ఇప్పించారు. ఆ రుణం తీరిన వెంటనే తిరిగి మళ్లీ బ్యాంక్‌లో రుణం తీసుకునే సౌకర్యాలు కల్పించారు. ఏరోజు పాలకు ఆ రోజు పాల శాతాన్ని బట్టి ధరలు రైతుల లెక్కలో జమ చేస్తారు. దీంతో పాడి రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చేది.

ఇతర సంస్థలతో నష్టాలు

పాడి రైతుకు లీటర్‌కు రూ.24 నుంచి రూ.28కి మించి ఇవ్వరు. 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు అందించారు. ప్రధానంగా ఏ రోజు పాల శాతాన్ని బట్టి పాల రేట్లు ఇవ్వకుండా 15 రోజుల పాల శాతాన్ని లెక్కలోకి తీసుకుని రేట్లు ఇచ్చేవారు. దీంతో ఒక్కో రైతుకు నెలకు రూ.5 వేలు మేర నష్టం వచ్చేది. మరోవైపు బ్యాంకు రుణాలు ఉండవు. రైతులు అప్పులు చేసుకుని ఆవులు, బర్రెలను కొనుగోలు చేయాల్సి ఉంది. దీంతోనే పాడి రైతులు గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన అమూల్ పాల సంస్థకే పాలు పోయడానికి మక్కువ చూపుతున్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న పాడి రైతులు

అమూల్ పాల ఉత్పత్తులు ఇలా..

జిల్లాలో తొలిదశలో వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో అమూల్ పాల సేకరణ ప్రారంభించారు. దశల వారీగా జిల్లాలోని 34 మండలాల్లో అమూల్ పాల సేకరణ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే 5 మండలాల్లో 47 గ్రామాల్లో పాల సేకరణ 16 నెలల కిందట 1850 మంది రైతుల నుంచి 3,560 లీటర్ల సేకరణతో మొదలు పెట్టారు. ఆరునెలలు గడిచే కొద్దీ ఏకంగా 15,592 మంది రైతుల నుంచి 19,500 లీటర్ల పాలసేకరణకు చేరారు. విస్తారంగా రైతులకు వడ్డీలేని బ్యాంకు రుణాలు ఇప్పించడంతో రైతులు పెద్దఎత్తున పశువులను కొనుగోలు చేసి పాలను అమూల్ సంస్థకు అందించేవారు. దానికితోడు సరైన గిట్టుబాటు ధరలు అందుతుండడంతో ఆసక్తి చూపించేవారు. అయితే సీఎం చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్‌కు లాభం చేకూర్చేందుకు ఇలా చేస్తున్నారని రైతులు వాపోయారు.

ఈ నెల 21 నుంచి ఆగిపోనున్న పాల వెల్లువ

గత ప్రభుత్వం గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే సహకార సంస్థను తిరిగి బలోపేతం చేయడానికి జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి గతేడాది శ్రీకారం చుట్టింది. అమూల్ కంపెనీకి పాలు విక్రయిస్తూ పాడి రైతులకు గిట్టుబాటు ధర పొందేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 103 గ్రామాల్లో పాల సేకరణ చేపట్టింది. ఇందుకు అవసరమైన బల్క్‌మిల్క్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుపతి జిల్లాలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాల్లో అమూల్ ఆధ్వర్యంలో పాల సేకరణ కార్యక్రమాలను చేపట్టింది. ధర కూడా ఇతర పాల డెయిరీల కంటే ఎక్కువగానే ఇచ్చే కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. అమూల్ డెయిరీ సిబ్బంది పాల సేకరణ జిల్లాలో ఈనెల 21 నుంచి నిలుపుదల చేస్తున్నందుకు చింతిస్తున్నామంటూ చెప్పడంతో మహిళా పాడి రైతులు లబోదిబోమంటున్నారు.

మాకు న్యాయం చేయండి



"మా పాడి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి. కేవలం పాల ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు ఆరుగాలం కష్టపడి పాలు అమ్మకుంటే పాలకు ఇప్పుడు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే జీవనం ఎలా సాగించాలి ? మాకు అమూల్‌తోనే గిట్టుబాటు ధర వస్తుంది. ఆ సంస్థను కొనసాగించాలని కోరుతున్నాం.
– ఇందిర, మారసామివారిపల్లె, చిన్నగొట్టిగల్లు

న్యాయం కోసం పోరాటం



"పాడి రైతులు న్యాయం కోసం పోరాటం చేయాల్సి ఉంది. ఎంతో శ్రమించి పాలను విక్రయిస్తే సరైన గిట్టుబాటు ధర ఇవ్వకుంటే ఎలా బతకాలి? మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అమూల్ సంస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ సంస్థను రద్దు చేయడం సరి కాదు. – విమల,కురవపల్లె, చిన్నగొట్టిగల్లు

మాపై రాజకీయ కక్షనా..!



"బర్రెలను బాగా చూసుకుని పాల ఉత్పత్తులను పెంచుకోవడం .. అమూల్‌కు పాలుపోయడం.. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ చేసుకోవడం మాత్రమే మాకు తెలుసు. అంతే తప్ప మాకు రాజకీయాలు తెలియవు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మా కష్టం మాకు తప్పదు అని భావించేవాళ్లం. అయితే హఠాత్తుగా అమూల్ సంస్థ పాల సేకరణ నిలుపుదల చేస్తున్నట్లు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాం. ఇది న్యాయంకాదు. అమూల్ సంస్థ ద్వారానే పాల సేకరణ ఉండేలా చూడాలని కోరుతున్నాం. – మంజుల, ఎస్‌సీవీ పురం, వడమాలపేట మండలం

అమూల్ సంస్థతోనే లాభాలు..



"పాడి రైతులకు అమూల్ సంస్థ ద్వారానే గిట్టుబాటు ధరలు ఇస్తున్నారు. ప్రధానంగా సరాసరిగా ఇస్తే మాకు నష్టం వచ్చేది. ఏ రోజు రేటు ఆ రోజు లెక్కించి ఇచ్చేవారు. అంతేకాదు రుణాలు ఇప్పించేవారు. ఇతర డెయిరీలతో పోల్చుకుంటే అమూల్ సంస్థ అధిక ధరలు ఉండేవి. మాకు రుణాలు ఇప్పించారు. ఆ రుణాలు కట్టాల్సి ఉంది. ఇలా పాల సేకరణ చేయకుంటే మేము రుణాలు ఎలా కట్టాలి ? మా బాధలు ప్రభుత్వం గుర్తించి మాకు తిరిగి అమూల్ నుంచి పాల ఉత్పత్తులు ఇప్పించాలి.
– ధనలక్ష్మి,వేణుగోపాల్‌పురం, పుత్తూరు మండలం

మా కడుపు కొట్టకండి సార్..



"మేము ఏడాదిగా కష్టపడి అమూల్ సంస్థకు పాలు పోస్తున్నాం. రేట్లు వస్తున్నాయని పాల ఉత్పత్తులను పెంచుకోవడానికి మరిన్ని పశువులను కొన్నాం. ప్రభుత్వం మారడంతో అమూల్ సంస్థ పాల సేకరణ లేదంటే మేము ఎలా బతకాలి సార్. కేవలం పాడిపైనే ఆధారపడి బతుకుతున్నాం. లక్షలు పెట్టి పాడిని కొన్నాం. ఇప్పుడు అమూల్ సంస్థ వాళ్లు పాల సేకరణ చేయలేకపోతున్నాం అంటుంటే బాధగా ఉంది. జిల్లాలో 20వేల లీటర్ల పాలు ఎవరికి పోయాలి ? మా బతుకులే ప్రశ్నార్థకంగా మారాయి. మాకు న్యాయం చేయాలనే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నాం. – గౌతమి, ఎలమంద, ఎర్రావారిపాళెం

శ్రీవారిని దర్శించుకున్న ప్రత్యేక ప్రతిభావంతులు



శ్రీవారి ఆలయం వెలుపల ప్రత్యేక ప్రతిభావంతులు

తిరుమల: శ్రీవారిని 1,008 మంది ప్రత్యేక ప్రతిభావంతులు, 495 మంది వలంటీర్లు, సహాయకులు సోమవారం దర్శించుకున్నారు. చెన్నైలోని రోటరీ క్లబ్, టీటీడీ స్థానిక సలహా మండలి సంయుక్తంగా చేపట్టిన 'ప్రత్యేక ప్రతిభావంతులకు శ్రీబాలాజీ దర్శనం' పేరిట యాత్రగా వచ్చిన వీరికి టీటీడీ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. బధిరులు, ప్రత్యేక ప్రతిభావంతులు, దివ్యాంగులైన చిన్నారులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి ధన్యవాదాలు తెలిపారు. చెన్నై టీటీడీ స్థానిక సలహామండలి అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, మహావీర్ బోత్రా, ఈవెంట్ చైర్మన్ పంకజ్ కంకరియా పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు



ఏఎస్పీలకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు జిల్లా ఏఎస్పీలు వెంకటరావు, విమల కుమారి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా ఏఎస్పీలను కలిసి 85 ఫిర్యాదులు అందజేశారు. ఆ ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వారు బదిలీ చేశారు. ఈ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, బాధితులకు ఏం న్యాయం చేశారనే వివరాలను త్వరలోనే తమ కార్యాలయంలో తెలియజేయాలని ఆదేశించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

ఎన్ఎస్‌యూలో ఆర్చరీ శిక్షణ



శిబిరానికి హాజరైన క్రీడాకారులతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ విద్యార్థులకు ఆర్చరీ క్రీడల శిక్షణా శిబిరాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా ఆసక్తి కనబరచాలన్నారు. మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయన్నారు. ప్రధానంగా ఆర్చరీ అనేక భారతీయ సంస్కృతికి నిలువుటద్దమని, అతిప్రాచీన కాలం నుంచి కొనసాగుతున్న విలు విద్యను విద్యార్థులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిబిరంలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు 77వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. డీన్ రజనీకాంత్ శుక్లా, చీఫ్ వార్డెన్ వెంకటరావు, సేతురాం, గిరికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 75,356 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,815 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన భక్తులను అనుమతించమని వెల్లడించింది.

ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ పనులు ప్రారంభించండి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సోమవారం పార్లమెంటులో డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం కోసం ప్రపంచ నలుమూలల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు వస్తుంటారని సభ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి ఆధ్యాత్మికంగానే కాకుండా విద్య, వైద్యానికి నిలయం అన్నారు. వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వస్తుంటారని, ఈ నేపథ్యంలో అత్యంత రద్దీగా ఉండే తిరుపతి బస్ టర్మినల్‌ను నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అత్యాధునిక ఇంటర్–మోడల్ బస్సు స్టేషన్ (ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను ప్రారంభించిందన్నారు. కొత్తగా నిర్మించే ఈ బస్ టర్మినల్ 30 ఏళ్ల పాటు ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్ ఒత్తిడిని పరిష్కరించడమే లక్ష్యంగా ఏర్పాటు కానుందని, ఈ కీలకమైన ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన మొదలుపెట్టి పూర్తి చేయడానికి గతంలో పలు ప్రతిపాదనలు ఇచ్చారని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఈ బస్ టర్మినల్ నిర్మాణాలను ఈపీసీ మోడల్లో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


తీవ్రంగా గాయపడిన చిట్టిబాబు

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శ్రీనివాస మంగాపురంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు శ్రీనివాసమంగాపురానికి చెందిన చిట్టిబాబు(68) నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు తీవ్ర గాయాలపాలవడంతో స్థానికులు 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిట్టిబాబు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ రవీంద్ర నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతూ..


మృతి చెందిన భీమారెడ్డి(60)

నాగలాపురం: మండలంలోని మలిమేలు కండ్రిగ వద్ద తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పాలసముద్రం గ్రామానికి చెందిన భీమారెడ్డి(60) నగరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు.

మరో వైఎస్సార్‌సీపీ నేత టార్గెట్?

- కమ్మపల్లి వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యం రెడ్డి కోసం టీడీపీ వెతుకులాట
- సుబ్రమణ్యంరెడ్డి కుమార్తె వస్త్ర దుకాణంలోకి చొరబడి అద్దాలు ధ్వంసం
- వైఎస్సార్‌సీపీ నేత కోసం టీడీపీ నేతలు రోజంతా గాలింపు
- పుంగనూరులో మంత్రి పర్యటన నేపథ్యంలో టీడీపీ మూకల వీరంగం
- రక్షణ కల్పించాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



సుబ్రమణ్యంరెడ్డి కోసం కుమార్తె నిర్వహిస్తున్న దుకాణంలోకి చొరబడిన టీడీపీ నేతలు


దుకాణం అద్దాలు పగులగొట్టిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: మరో వైఎస్సార్‌సీపీ నాయకుడిని లేపడానికి టీడీపీ నేతలు కుట్ర చేశారా? గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పుంగనూరులో సోమవారం రవాణాశాఖ మంత్రి పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనంగా తెలుస్తోంది. పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం కమ్మపల్లిలో సుమారు 150 కుటుంబాలు ఉన్నాయి. అందులో 13 కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు. మిగిలిన వారంతా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు. కమ్మపల్లిలో సంఘమిత్ర మమత ఏడాది క్రితం పొదుపు సంఘాలకు చెందిన రూ.5 లక్షల నగదును స్వాహా చేశారు. ఈ విషయం గత ఏడాది నవంబర్ 21న వెలుగులోకి రావడంతో స్థానికులు నిలదీశారు. డిసెంబర్ 9న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీకి చెందిన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని విచక్షణా రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో దాడులకు తెగబడిన వారిపై కేసులు నమోదు చేశారు. కట్ చేస్తే.. సాధారణ ఎన్నికల్లో బాధిత కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీకి ఓటువేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాది క్రితం జరిగిన సంఘటనను మనసులో పెట్టుకుని, గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 13 కుటుంబాలను లేకుండా చేయాలని నిర్ణయించుకున్నారు. జూన్ 5వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన 13 కుటుంబాలపై దాడులకు తెగబడ్డారు. నివాసాల్లోకి దూరి చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా విచక్షణా రహితంగా చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోకి వచ్చి అలా చూస్తుండిపోయారు. పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను చిత్రహింసలకు గురిచేశారు. టీడీపీ మూకల దాడులకు భయపడి సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం అదే రోజు రాత్రి ఊరు విడిచి అడవిలోకి వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు బిక్కు బిక్కుమంటూ అడవిలోనే గడిపింది. అతికష్టమ్మీద పుంగనూరులోని కుమార్తె జయంతి నివాసానికి చేరుకున్నారు. వీరిని తిరిగి రప్పించాలంటూ మిగిలిన 12 కుటుంబాలను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వీరి చిత్రహింసలకు భరించలేక మరో మహిళ ఊరు వదిలి వెళ్లిపోయింది. ఇప్పటికీ ఎక్కడున్నారో తెలియదు.

మంత్రి పర్యటనలో స్కెచ్

వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి పుంగనూరులోని కుమార్తె నివాసంలో తలదాచుకున్న విషయం టీడీపీ నేతలు తెలుసుకున్నారు. ఆ రోజు నుంచి కుమార్తె జయంతికి గ్రామంలోని బంధువుల నుంచి, స్నేహితుల నుంచి ఫోన్లు చేయించి బూతులు తిట్టేవారు. ఊర్లోకి రాకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సుబ్రమణ్యం రెడ్డి ఊర్లోకి రాకపోవడంతో పుంగనూరుకే వెళ్లి మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకు సోమవారం పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటనను వాడుకునేందుకు ప్రయత్నించారు. మంత్రి పర్యటన కోసం అంటూ కమ్మపల్లి నుంచి టీడీపీకి చెందిన కొందరు ప్రత్యేక వాహనాల్లో పుంగనూరుకు చేరుకున్నారు. సుబ్రమణ్యంరెడ్డి కుమార్తె నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలోకి చొరబడ్డారు. షాపులో ఉన్న టైలర్‌ను సుబ్రమణ్యంరెడ్డి, కుమార్తె జయంతి గురించి ఆరా తీశారు. దుకాణంలో రేపటి నుంచి పనిచేయవద్దని హెచ్చరించారు. లోపల ఉన్న కుట్టుమిషన్లు, అద్దాలు ధ్వంసం చేశారు. వెళ్తూ వెళ్తూ గదిని అద్దెకు ఇచ్చిన యజమానిని హెచ్చరించారు. దుకాణం వెంటనే ఖాళీ చేయించాలని హుకుం జారీ చేశారు. సుబ్రమణ్యం రెడ్డి ఆచూకీ కోసం సోమవారం రాత్రి వరకు గాలించారు. టీడీపీ నేతల స్కెచ్ మీడియాకు లీక్ అవడంతో పుంగనూరు నుంచి జారుకున్నట్లు సమాచారం.

ఆస్తులు, పంట ఉత్పత్తులు ధ్వంసం

సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని ఊర్లోకి పిలిపించే వరకు 12 కుటుంబాల వారికి చెందిన పంట దిగుబడులు, పాలు విక్రయించడానికి వీల్లేకుండా చేశారు. సుబ్రమణ్యంరెడ్డి ఇటుక బట్టీలను ధ్వంసం చేశారు. సుమారు 20 ఎకరాల్లోని టమాటా పంటను విక్రయించకుండా అడ్డుకోవడంతో పూర్తిగా పాడైపోయింది. కమ్మపల్లిలో బంధీలుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కుటుంబాలను టీడీపీ నేతలు మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమించమని అడిగి కాళ్లు పట్టుకునే వరకు వారిని విడిచి పెట్టలేదు. ఈ విషయాలు ఎవరికీ తెలియకుండా, ఫొటోలు, వీడియోలు తీయకుండా టీడీపీ మూకలు వారి వద్ద ఉన్న ఫోన్లు లాక్కున్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబాల జీవనం సాఫీగా సాగాలంటే సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని ఊర్లోకి పిలిపించాలని ఒత్తిడి చేస్తున్నారు. మరో వైపు సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని రప్పించేందుకు అప్పులు చేసి పారిపోయారని దుష్ప్రచారం చేశారు.

మా ప్రాణాలకు ముప్పు



“ కమ్మపల్లికి చెందిన రమేష్‌నాయుడు, చిట్టిబాబునాయుడు, త్రిలోక్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు తదితరుల నుంచి మా ప్రాణాలకు హాని ఉంది. మా అమ్మా నాన్నలతోపాటు నా కోసం వెతుకుతున్నారు. మా పంటలను ధ్వంసం చేశారు. ఇటుకలను ఎత్తుకెళ్లారు. పశువులకు మేతకూడా వేయకుండా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మమ్మల్ని, మా వాళ్లను చిత్రహింసలు పెడుతున్నారు. గ్రామంలో మా వాళ్లకు ఏం జరిగిందో, ఎలా ఉన్నారో కూడా తెలియదు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు.

– జయంతి, సుబ్రమణ్యంరెడ్డి కుమార్తె

మూడు బైక్‌లు దగ్ధం


మంటల్లో కాలిపోయిన మూడు బైక్‌లు

దొరవారిసత్రం : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మూడు బైక్‌లు కాలిపోయిన ఘటన మండలంలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. పోలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన గంగబత్తిన మస్తానయ్య తన స్కూటీ, బైక్‌ను ఇంటి ఆవరణలో పార్క్ చేశాడు. ఆదివారం భారీ వర్షం పడడంతో పోలిరెడ్డిపాళెం గ్రామం వద్ద రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి కిందకు వర్షం నీరు చేరడంతో గొల్లపాళెం గ్రామానికి చెందిన షేక్ రహీన స్కూటీపై దాటుకోలేక ఆమె కూడా మస్తానయ్య ఇంటి ఆవరణలోనే తన వాహనాన్ని ఉంచి స్వగ్రామానికి వెళ్లిపోయింది. అయితే ఆదివారం అర్ధ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు బైక్‌లకు నిప్పుపెట్టి పరారయ్యారు. పెద్ద మంటలు రావడంతో చుట్టుపక్కల వారు లేచి అదుపు చేసే ప్రయత్నం చేశారు. వారితో కాకపోవడంతో సూళ్లూరుపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. జరిగిన ఘటనపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


నిందితుల అరెస్టు చూపుతున్న సెబ్ అధికారులు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో అక్రమంగా స్కూటీలో తరలిస్తున్న 72 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అరుణకుమారి సోమవారం సాయంత్రం మీడియాకు వివరాలను వెల్లడించారు. పట్టణంలో పాత బస్టాండు వద్ద సెబ్ సీఐ తనిఖీలు చేపట్టగా, పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్కూటీలో అక్రమంగా తరలిస్తున్న 180 ఎంఎల్ ఉన్న 72 మద్యం బాటిళ్లను గుర్తించి పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపులో వాటిని కొనుగోలు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఇద్దరినీ అరెస్టు చేసి వారిని కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు. మద్యంతో పాటు స్కూటీని సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ మద్యంషాపులో కొనుగోలుకు సంబంధించి కూడా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

భక్తుల దృష్టి మరల్చి నగలు చోరీ

నాలుగు గంటల్లోనే నిందితురాలి పట్టివేత


నగలను చూపుతున్న సీఐ

తిరుమల : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల దృష్టి మరల్చి బ్యాగులోని బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఓ పాత నేరస్తురాలిని పోలీసులు నాలుగు గంటల్లో పట్టుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తిరుమల వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన నందీశ్వరుడు, మల్లీశ్వరి దంపతులు నెల కిందట తిరుపతిలోని తమ కుమార్తె ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. సోమవారం తమ కుమార్తె, అల్లుడు ఉద్యోగరీత్యా బయటకు వెళ్లడంతో వీరు ఉదయం 10 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద ఉదయం 11 గంటల సమయంలో కొబ్బరికాయలు కొట్టేందుకు వెళ్లినపుడు ఓ గుర్తు తెలియని మహిళ వాళ్లను పక్కకు వెళ్లమని చెప్పి దృష్టి మరల్చి వారి బ్యాగు జిప్ తీసి బంగారు నగల బాక్స్‌ను కాజేసింది. వెంటనే దంపతులు బంగారు ఆభరణాల బాక్స్ చోరీపై అక్కడే ఉన్న టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారిని వెంటనే సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తీసుకెళ్లి దృష్టి మరల్చిన మహిళను గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో తిరుమల వన్‌టౌన్ సీఐ, విజిలెన్స్ వింగ్ వీజీఓ రామ్‌కుమార్ ఆదేశాలతో ఏవీఎస్‌ఓలు వారి సిబ్బందితో కలిసి సదరు మహిళ కోసం తిరుమలలో గాలించగా స్థానిక కర్ణాటక సత్రాల వద్ద గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.13 లక్షల విలువైన 230 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన నిందితురాలిని అనంతపురానికి చెందిన పాత నేరస్తురాలు జింకల లతగా గుర్తించారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. చోరీ కేసును 4 గంటల్లో ఛేదించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఖాళీగా కనిపిస్తే కబ్జానే..!

- తిరుపతి శివారు ప్రాంతాల్లో ఆగని ఆక్రమణలు
- నామమాత్రపు చర్యలు తప్ప ఆక్రమణలు తొలగింపేదీ ?


మంగళం కొళ్లఫాం వద్ద ఆక్రమణలను తొలగించకుండా వదిలేసిన రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం : తిరుపతి శివారు ప్రాంతాల్లో రోజురోజుకు భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడైనా కాస్త ప్రభుత్వ స్థలం కనిపిస్తే వెనుకా ముందు ఆలోచించకుండా పలువురు కబ్జా చేస్తున్నారు. మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని కొళ్లఫాం వద్ద గల సర్వే నంబర్ 226లో సుమారు రూ.50 లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని స్థానికంగా కాపురం ఉన్న కొందరు ఆక్రమించేశారు. ఇదేమిటని స్థానికులు ప్రశ్నిస్తే తమ ఇంటి ముందు ఖాళీగా ఉందని కట్టేసుకుంటున్నామంటూ దర్జాగా చెబుతున్నారు. అయితే విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలం ఇందులో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అంతా బాగానే ఉన్నా ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు వాటిని తొలగించకుండా వెళ్లిపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఇలా ఆక్రమణలకు తొలగించకుండా వదిలేస్తే అందులో కొంతకాలానికి భవనాలే వెలుస్తాయి. కొన్నాళ్లకు ప్రభుత్వ స్థలం కబ్జాదారుల పర్వం సొంతం అవుతుంది. ఇప్పుడే రెవెన్యూ అధికారులు ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించి అందులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే మరోసారి ఎవరూ ఆక్రమణలకు పాల్పడకుండా ఉంటారు. ఇప్పటికైనా మంగళం కొళ్ల ఫాం వద్ద ఆక్రమణలకు వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

టీటీడీ అన్నప్రసాదం, గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు


టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి విరాళం డీడీలను అందిస్తున్న దాతలు

తిరుమల : చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లెకు చెందిన దామరపాటి శంకర్, దామరపాటి మురళి టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10,11,111 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,11,111 లక్షలను విరాళంగా ఇచ్చారు. సోమవారం వారు టీటీడీ అదనపు ఈఓ కార్యాలయంలో అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి డీడీలను అందజేశారు.

గ్రీవెన్స్‌కు 201 వినతులు


అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మొత్తం 201 అర్జీలు వచ్చాయి. వివిధ సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. డీఆర్‌ఓ పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రామ్మోహన్, నరసింహులు, కోదండరామిరెడ్డి అర్జీలను స్వీకరించారు. మొత్తం వినతుల్లో రెవెన్యూ సమస్యలపైనే 130 వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. అయితే ఎప్పటిలాగే సోమవారం గ్రీవెన్స్‌లో అధికారుల తీరు ఏ మాత్రం మారలేదు. ప్రధానంగా పోలీసులు అర్జీదారులను మూడు దశల్లో తనిఖీలు చేయడం కొనసాగించారు. దీంతో ప్రజలకు తిప్పలు తప్పలేదు. మరోవైపు తాగునీటి సౌకర్యం లేక పలువురు ఇబ్బందిపడ్డారు. పెద్దసంఖ్యలో జనం అర్జీలు రాయడం తెలియక నానా అవస్థలు పడ్డారు.

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– రెండు బైక్‌లు, నలుగురు వ్యక్తుల అరెస్టు


ఎర్రచందనం దుంగలు, నిందితులను చూపుతున్న అధికారులు

వెంకటగిరిరూరల్: వెలుగొండ కొండల నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను స్థానిక అటవీశాఖ రేంజర్ రాజేంద్రప్రసాద్, తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు చిరంజీవులు, ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి రేంజర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు, సీసీకండ్రిగ, డక్కిలి మండలం అటవీ ప్రాంతం వైపు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున రెండు బైకుల్లో పారవోలు, సీసీకండ్రిగ గ్రామాలకు చెందిన సురేంద్ర, పెంచలయ్య, వెంకటేష్, రేణిగుంటకు చెందిన సురేష్‌బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించి, అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులతో పాటు 12 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను అదుపులోకి తీసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించామని తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

– నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట టౌన్ : 3వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడి చేస్తుండగా.. స్థానికులు గుర్తించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని చిన్న దర్గా సమీపంలో ఎస్‌కే నౌషద్ అనే వ్యక్తి చేపల అక్వేరియం నడుపుతున్నాడు. అతని దుకాణంలో ఉన్న రంగులు, రంగుల చేపలను చూసేందుకు వస్తున్న 8 ఏళ్ల చిన్నారిపై కన్ను వేశాడు. ఆ చిన్నారికి చేపలను ఇస్తానని చెబుతూ, చాక్‌లెట్లు కొనిస్తూ దగ్గరయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద చిన్నారి తల్లిదండ్రులు లేనిది చూసి చిన్నారిని సమీపంలోని పాఠశాల ఆవరణలోకి తీసుకెళ్లాడు. అక్కడ లైంగిక దాడి చేస్తుండడాన్ని స్థానిక యువకులు గుర్తించారు. వారు అతన్ని పట్టుకోవడానికి యత్నించగా పరారయ్యాడు. మళ్లీ సోమవారం ఉదయం ఆ వ్యక్తి చిన్నారి కోసం స్కూల్ వద్దకు రావడంతో స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గతంలోనూ పలుమార్లు ఇలా లైంగిక దాడి చేసినట్టు చిన్నారి చెప్పిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. కాగా, నౌషద్ తన భార్యను సైతం గతంలో మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదుచేసి.. పాపతో పుట్టింటికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.